
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 22 జూలై 2024



• కలశ యాత్ర



జిల్లాలో ఆదివారం గురుపౌర్ణమి ఘనంగా జరిగింది. సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడ్లవల్లేరులోని గంగాపార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి దేవస్థానంలోని సాయిబాబా ఆలయంలో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద నుంచి 365 కలశాలతో మహిళలు ఊరేగింపుగా ప్రధాన వీధుల మీదుగా సిద్దేశ్వరాలయాన్ని చేరుకున్నారు. ప్రదర్శనలో కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. - గుడ్లవల్లేరు

కిక్కిరిసి..

- చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు
- ముగిసిన శాకంబరీ ఉత్సవాలు





దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శాకంబరీ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈనెల 19వ తేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని, దుర్గమ్మవారి మూల విరాట్, ఉపాలయాలనూ, దేవతల విగ్రహాలనూ... పండ్లు, కూరగాయలతో అలంకరించారు. ఈ ఉత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా అందించిన కదంబ ప్రసాదాన్ని స్వీకరించి ఆనందించారు. - వన్‌టౌన్



దుర్గగుడిలో బారులు తీరిన భక్తులు

ముంపులోనే..

నీటిలోనే వరి పొలాలు
పొంగుతున్న డ్రెయిన్లు



గూడూరు మండలం ముక్కొల్లులో నీటమునిగిన వరిపొలాలు

- ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళనపై కలెక్టర్ దృష్టి సారించాలని రైతుల వినతి
- పెడన మండలంలోని పలు గ్రామాలు జల దిగ్బంధంలోనే..

జిల్లాను ముసురు వీడలేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆగలేదు. అల్పపీడనం ప్రభావంతో ఆదివారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలోని డ్రెయిన్లు, పంట కాలువలకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంటకాలువల్లో నాచు, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఈపాటికే వరి సాగు చేసిన పొలాలు నీటమునిగాయి. ఇంకా రోజులు గడిచేకొద్దీ పంటలు పూర్తిగా దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా కృత్తివెన్నులో 7.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెదపారుపూడిలో 1.4 మిల్లీ మీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 3.3 మిల్లీమీటర్లు నమోదైంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.65 లక్షల హెక్టార్లలో వరి సాగు అవుతుందని అంచనాగా ఉంది. ఇప్పటివరకు 65వేల హెక్టార్లలో వరిసాగైంది. ఇందులో వెదజల్లే పద్ధతిలో 33 వేల హెక్టార్లలో వరినాట్లు వేశారు. ఈ పద్ధతిలో వరినాట్లు వేసిన పొలాల్లో పదిహేను, ఇరవై రోజుల వయసున్న వరిపైరు నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నీట మునిగింది. పెడన, గుడ్లవల్లేరు, గూడూరు, మచిలీపట్నం తదితర మండలాల్లో ప్రధాన డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షపునీరు పొలాల నుంచి బయటకు వెళ్లని స్థితి. లజ్జబండ, వడ్లమన్నాడు, శివగంగ, గుండేరు డ్రెయిన్‌లలో జమ్ము, తూటుకాడ, గుర్రపుడెక్క, కిక్కిస పేరుకుపోవడంతో పొలాల్లో నిల్వ ఉన్న వర్షపునీరు దిగువకు పోవడం లేదు. ఇప్పటికే నీటమునిగిన వరిపైరు మరో నాలుగు రోజులపాటు నీటిలో ఉంటే కుళ్లిపోతుందనే భయం రైతులను వెంటాడుతోంది.



పొంగి ప్రవహిస్తున్న శివగంగ డ్రెయిన్

పూడికతీతపై కలెక్టర్ దృష్టి సారించాలి

ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా జూన్ 6వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, జమ్ము, నాచు, కిక్కిసలను తొలగించే నిర్వహణ పనులను చేసేందుకు చర్యలు తీసుకోలేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కాలువల నిర్వహణ పనులకు టెండర్లు పిలిచారు. పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే అంశంలో సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో ఇంకా కొలిక్కిరాలేదు. కొన్ని పనులు కాంట్రాక్టర్లకు అప్పగించినా భారీ వర్షాలు కురుస్తున్నాయనే కారణంతో కాలువల్లో గుర్రపుడెక్క, నాచు, తూటుకాడ తొలగింపు పనులు చేయడం లేదు. ఈలోగా ప్రధానడ్రెయిన్‌లలో గుర్రపుడెక్క, నాచు, తూటుకాడ మరింతగా పెరిగినీటి ప్రవాహనికి అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకుని జలవనరులశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడిక తీయిస్తేనే ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటసాగు చేయడానికి అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. గతేడాది కాలువల్లో పూడికతీత తీయించే పనులపై గతేడాది కలెక్టర్ జలవనరులశాఖ అధికారుల వెంటపడినా పనులు సక్రమంగా చేయకుండానే మమ అనిపించారు. బిల్లులు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.
ఈ ఏడాది ఆ పరిస్థితి తలెత్తకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం కాలువల నిర్వహణ పనులను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా, డివిజన్ స్థాయి కమిటీ సభ్యులు అన్ని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌లను పరిశీలించి, అవసరమైనచోట పూడికతీత పనులు వెంటనే చేయించాలని రైతులు కోరుతున్నారు.

ముంపులోనే గ్రామాలు, పంటపొలాలు

పెడన నియోజకవర్గంలోని గూడూరు, పెడన మండలాల్లోని నెరికేపాలెం, రామానుజఉత్తర్లపల్లి, కంకటావ, ముక్కొల్లు, కప్పలదొడ్డి, నారికేడలపాలెం తదితర గ్రామాలనుంచి మురుగునీరు లజ్జబండ డ్రెయిన్‌లో కలుస్తుంది. ఈ డ్రెయిన్‌లో పూడికతతీ పనులు సక్రమంగా చేయకపోవడంతో డ్రెయిన్ వెంబడి ఉన్న పొలాలు ఇంకా ముంపుబారిలోనే కొట్టుమిట్టాడుతున్నాయి.

- పెడన మండలంలోని నందిగామ, నడుపూరు, కొంకేపూడి, పుల్లపాడు గ్రామాల్లోని రహదారులపై భారీవర్షాల కారణంగా వర్షపునీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజుల క్రితం గ్రామాల్లో వర్షపునీరు నిలబడకుండా ఉపాధి పనుల ద్వారా డ్రెయిన్‌ల లోకి నీటిని మళ్లించే పనులను చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.
- మండల పరిషత్ కార్యాలయంలో ఈ అంశంపై సమావేశం ఏర్పాటు చేసినా, ఈ పనులు ఇంత వరకు ప్రారంభించలేదు.
- కొంకేపూడి వంతెన నుంచి రైల్వేగేట్ వరకు వడ్లమన్నాడు డ్రెయిన్‌లో కొంతమేర పూడికతీత పనులు చేశారు. ఈ డ్రెయిన్‌కు ఎగువ, దిగువ ప్రాంతాల్లోని పొలాల్లో నీరు అలానే ఉండిపోయింది.
- ఘంటసాల మండల పరిధిలోని గుండేరు డ్రెయిన్‌లో రెండు రోజులుగా గుర్రపుడెక్క తొలగింపు పనులు చేస్తున్నారు. దీంతో కొంతమేర వర్షపునీరు పొలాల్లో నుంచి బయటకు వెళుతోంది.
- గుండేరు డ్రెయిన్‌కు లంకపల్లి, దిగువప్రాంతం వరకు పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క, నాచులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.
- మచిలీపట్నం మండలంలోని శివగంగ, లంకపల్లి, తాళ్లపాలెం డ్రెయిన్‌లలో పూడికతీత పనులు ప్రారంభించకపోవడంతో ఎస్ఎన్ గొల్లపాలెం, సీతారామపురం, గుండుపాలెం, బుద్దాలపాలెం, పోతిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లోని వరిపొలాలు ముంపుబారిన పడ్డాయి.

దర్శనం కష్టాలు



రూ.500 దర్శనం వద్ద రాంగ్‌రూట్‌లో వెళుతున్న భక్తులు

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

- అన్ని మార్గాల్లో భక్తుల రద్దీ
- దర్శనానికి నాలుగు గంటలు
- వీఐపీ దర్శనాలతో సామాన్యులకు ఇబ్బందులు
- చేతులు ఎత్తేసిన సెక్యూరిటీ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చి భక్తులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి చుక్కలు కనిపించాయి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు క్యూలైన్‌లోకి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి నాలుగు గంటలకుపైగా సమయం పట్టింది. ఇంద్రకీలాద్రిపై ఏది ప్రవేశ మార్గమో, ఏది బయటకు వెళ్లే మార్గమో తెలియలేదు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, సెక్యూరిటీ సిబ్బంది చేతులెత్తేయడంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. చివరికి సహనం నశించిపోయిన భక్తులు అధికారులపై ధ్వజమెత్తారు. అక్కడే ఉన్న సిబ్బందిని నిలదీశారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై మూడు ఘట్టాలు ఒకేసారి వచ్చాయి. ఆదివారం గురుపౌర్ణమి. ఈనెల 19వ తేదీ నుంచి ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను పూర్ణాహుతితో ముగించారు. ఈ రెండు కాకుండా కొద్దిరోజులుగా అమ్మవారికి మహిళలు భారీగా సంఖ్యలో ఆషాఢమాస సారె సమర్పిస్తున్నారు. వాళ్లంతా భక్త బృందాలుగా ఏర్పడికి ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. గురుపౌర్ణమి, శాకాంబరీ ఉత్సవాల ముగింపు, సారె సమర్పణలు ఒకేసారి జరగడంతో భక్తులు లెక్కకు మించి వచ్చారు. ఈ మూడు అంశాలను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో

రాకపోకలకు భక్తుల అవస్థలు

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండచరియలు విరిగి పడతాయన్న కారణంగా ఘాట్‌రోడ్డును అధికారులు పూర్తిగా మూసివేశారు. అధికారుల వాహనాలను, ఆలయ సిబ్బంది ద్విచక్ర వాహనాలను మాత్రమే పైకి అనుమతిస్తున్నారు. కాలినడకన వచ్చే భక్తులను నిలుపుదల చేశారు. దుర్గాఘాట్ వద్ద నుంచి దేవస్థాన బస్సుల్లో భక్తులను కొండపైకి తీసుకొస్తున్నారు. మరోపక్క కనకదుర్గ నగర్‌లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. దీంతో కనకదుర్గ నగర్ ఇరుకుగా మారింది. ఘాట్ రోడ్డును మూసివేయడంతో భక్తులకు కనకదుర్గ నగర్ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ మార్గంలో ఉన్న మహామండపం వద్ద లిఫ్టులు ఉన్నాయి. ఇక్కడి నుంచి వృద్ధులు, రూ.500 టికెట్ భక్తులను అనుమతిస్తామని బోర్డులు పెట్టారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 దర్శనం భక్తులు క్యూలైన్ల నుంచి వెళ్లాలని మరో బోర్డు పెట్టారు.

క్యూలైన్లు కిటకిట

దర్శనానికి వచ్చే భక్తులు, సారె సమర్పించడానికి వచ్చిన భక్తులు క్యూలైన్లు నిండిపోవడంతో లిఫ్టుల వైపు వచ్చారు. దర్శనం పూర్తయిన భక్తులను తిరిగి లిఫ్టుల్లో తీసుకొచ్చి కింద వదిలారు. కొంతమంది భక్తులు మహామండపం మెట్లమార్గం నుంచి కిందికి దిగారు. ఈ భక్తులు బయటకు వెళ్లడానికి బారికేడ్లతో ఒక తాత్కాలిక క్యూను ఏర్పాటు చేశారు. దీనికి వ్యతిరేక మార్గంలో భక్తులు పైకి వెళ్లారు. లిఫ్టుల వద్ద, క్యూల్లో భక్తులు ఎక్కువగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు మెట్ల మార్గం నుంచి పైకి వెళ్లాయి. కిందికి దిగే భక్తులు, ఎక్కే భక్తులు ఈ మెట్ల నుంచి రావడంతో అడుగు ముందుకు వేయలేని పరిస్థితి కనిపించింది. పాత మెట్ల నుంచి పూజ చేసుకుంటూ పైకి సారెతో వచ్చిన భక్తులు అక్కడున్న ఈవో కార్యాలయం వద్ద గూమిగూడిపోయారు. ఈ మార్గం మొత్తం ఆగిపోవడంతో పోలీసులు వారిని వెనక్కి తీసుకొచ్చి క్యూల్లోకి పంపాల్సి వచ్చింది. దర్శనం అయిన తర్వాత బయటకు వెళ్లాల్సిన భక్తులు గుడికి కుడివైపున ఉన్న మార్గం నుంచి బయట వెళ్లడానికి ప్రయత్నించారు. ఇక్కడ నుంచే వీఐపీ పేరుతో భక్తులు దర్శనానికి రావడం మొదలుపెట్టారు. ఇక్కడ గేటుకు సెక్యూరిటీ తాళాలు వేయడంతో భక్తులు నిలిచిపోయారు.

• అంచనాలో అధికారుల విఫలం

తాము గంటల తరబడి నిలబడితే వీఐపీ ముసుగులో ఎంతమందికి దర్శనాలు చేయిస్తారని క్యూల్లో ఉన్న భక్తులు ప్రశ్నించారు. దీంతో అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది వెళ్లిపోయారు. ఆలయానికి ఎదురుగా ఉన్న రాజగోపురం వద్ద భక్తులు భారీగా నిలిచిపోయారు. పోలీసులు, సెక్యూరిటీ నిలుపుదల చేసినా బారికేడ్లను దాటుకుని లోపలకు వెళ్లారు. అమ్మవారికి 12 గంటలకు ఇచ్చే నివేదన కారణంగా కొంతసేపు దర్శనాన్ని నిలుపుదల చేశారు. దీంతో భక్తుల సంఖ్య మరింతగా పెరిగిపోయింది. పరిస్థితిని అంచనా వేయడంలో అధికారులు విఫలమవ్వడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని భక్తులు విమర్శిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది విజిల్స్ చేయడం తప్ప భక్తులను క్రమపద్ధతిలో దర్శనానికి వంపలేదని ఆరోపించారు.

సుప్రీంకోర్టు ఆదేశాలన్నా బేఖాతరు చేసి ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులు తమ ఇష్టానుసారం రెవెన్యూలో పాతుకుపోయారు. తహసీల్దార్లు, ఆర్డీవోలుగా చెలామణీ అవుతున్నారు. డబుల్ పదోన్నతులు అందుకుని మిగిలినవారి కంటే ఎక్కువ స్థానంలో ఉన్నారు. వీరివల్ల తమకు అన్యాయం జరుగుతోందని రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ తరహాలో పలువురు తహసీల్దార్లు, ఆర్డీవోలుగా పనిచేస్తుండటం చర్చనీయాంశం అవుతోంది.

మేం కదలం!

10/99 రిక్రూట్‌మెంట్ వివాదంతో రెవెన్యూలో రచ్చ

- ఇతర శాఖల నుంచి వచ్చి ఉద్యోగులు రెవెన్యూలో తిష్ట
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పాగా
- రెండుచోట్లా పదోన్నతులతో ఆర్డీవోలుగా చెలామణి
- రెవెన్యూలో మొదటి నుంచి పనిచేస్తున్న వారికి అన్యాయం
- పాతుకుపోయిన వారికి ఫోకల్ పోస్టులు.. పనిచేసే వారికి నాన్ ఫోకల్ పోస్టులు
- వెళ్లిపోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించినా లెక్కచేయని పరిస్థితి
- ప్రభుత్వం దృష్టి పెడితేనే సమస్యకు పరిష్కారం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూ శాఖలో అత్యంత వివాదాస్పదంగా మారిన 10/99 రిక్రూట్‌మెంట్ సందర్భంలో తలెత్తిన సమస్య ఇప్పటికీ రెవెన్యూ ఉద్యోగుల్లో చిచ్చు రేపుతూనే ఉంది. 1999లో రెవెన్యూలో ఖాళీలకు సంబంధించి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం చాలామంది ఆశావహులు పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. అప్పట్లో తగిన ఖాళీలు లేవన్న పేరుతో ఇతర శాఖలకు వెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో హయ్యర్ ర్యాంక్ కలిగిన వారంతా కోఆపరేటివ్, రిజిస్ట్రేషన్స్, ఎక్సైజ్, కమర్షియల్ టాక్సెస్ వంటి విభాగాల్లోకి వెళ్లారు.

• కోర్టులో కేసు

రెవెన్యూలో తగినన్ని ఖాళీలు ఉన్నప్పటికీ తక్కువ సంఖ్యలో పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని పలువురు అప్పట్లో కోర్టులో కేసు వేశారు. ఈ క్రమంలో ఖాళీలు ఉన్నాయని అప్పటి ప్రభుత్వం కూడా కోర్టుకు నివేదించింది. దీంతో అప్పట్లో ఇతర డిపార్ట్‌మెంట్లకు వెళ్లిన వారంతా రెవెన్యూలోకి పలు దఫాలుగా వచ్చారు. ఇలా వచ్చినవారు గతంలో రెండు, మూడు పదోన్నతులు పొందినవారు కూడా ఉన్నారు. అక్కడ పదోన్నతులు అందుకోవటంతో పాటు ఆ స్థాయితో ఇక్కడ ఎక్కువ కేడర్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఇక్కడ వచ్చిన పదోన్నతులతో కూడా పలువురు ఆర్డీవో క్యాడర్‌లో కొనసాగుతున్నారు. దీనివల్ల మొదటి నుంచి రెవెన్యూ శాఖలోనే పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోంది. ఇలా పైరవీలు చేస్తూ ఇక్కడే తిష్టవేసిన వారికి కోరుకున్న స్థానాలు కూడా దక్కుతున్నాయి. రెవెన్యూ గురించి అవగాహన, చట్టాల మీద పట్టు ఉన్నవారు నాన్‌ఫోకల్ పోస్టుల్లో కొనసాగుతున్నారు.

• సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు

ఇటీవలే సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. గతంలో జరిగిన పొరపాట్ల కారణంగా తలెత్తిన గందరగోళాలను దృష్టిలో ఉంచుకుని మొదటిగా ఏ శాఖలో డిప్యూట్ అయ్యారో వారంతా తిరిగి వచ్చేయాలని, తమ శాఖల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. దీంతో కొంతమంది వెళుతున్నా.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పైరవీలు చేస్తున్నవారు మాత్రం కదలటం లేదు. కూటమి ప్రభుత్వం ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించిన నేపథ్యంలో, ప్రభుత్వం కూడా తీర్పును గౌరవించేలా చర్యలు తీసుకోవటానికి వీలుగా ఆదేశాలను ఇవ్వాల్సిన అవసరం ఉంది.

తేలప్రోలు సమీపంలో ఏలూరు కాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



లభ్యం కాని ఎంపీడీవో ఆచూకీ

• కొనసాగుతున్న గాలింపు చర్యలు 6లో..


వానలు తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద సెల్ఫీలు దిగుతున్న నగరవాసులు

తగ్గిన ముసురు

▸ జిల్లాలో 38 మి.మీ వర్షపాతం

విజయవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి) : గడచిన కొద్దిరోజులు జిల్లాను తడిపేస్తున్న వర్షం కాస్త తెరపు ఇచ్చింది. ఆదివారం జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. జిల్లాలో అత్యధికంగా తిరువూరు మండలంలో 7.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా జి.కొండూరు, కంచికచర్ల, విజయవాడ రూరల్, తూర్పు, ఉత్తరం మండలాల్లో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరువూరు 7.6, ఎ.కొండూరు 4.0, వత్సవాయి 3.6, గంపలగూడెం 3.4, విస్సన్నపేట 3.2, రెడ్డిగూడెం 2.6, మైలవరం 2.4, జగ్గయ్యపేట 1.6, పెనుగంచిప్రోలు 1.2, వీరులపాడు 1.2, చందర్లపాడు 1.0, నందిగామ 0.8, ఇబ్రహీంపట్నం0.8, విజయవాడ సెంట్రల్ 0.8, విజయవాడ పశ్చిమ 0.8, జి.కొండూరు 0.6, కంచికచర్ల 0.6 వర్షం కురిసింది. వర్షాలకు అంటువ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు విజయవాడ నగరంలో రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రయాణం నరకప్రాయంగా మారింది.


రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీంద్రరాజు

పార్ట్ టైం అధికారుల గౌరవ వేతనం పెంచాలి

▸ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

కృష్ణలంక, జూలై 21 : రాష్ట్రంలోని పార్ట్ టైం గ్రామ రెవెన్యూ అధికారుల గౌరవ వేతనాన్ని రూ.4 వేలనుంచి 15వేలకు పెంచాలని కోరుతూ ఆదివారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ, పార్ట్ టైం గ్రామ రెవెన్యూ అధికారులకు రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. గత టీడీపీ హయాంలోనే వారికి రూ.4 వేల వేతనం ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు రూ.4 వేలు, రూ.6 వేలు పెన్షన్ ఇస్తున్నందున 60 సంవత్సరాలు రైతులకు, ప్రజలకు సేవలందించిన రిటైర్డ్ పార్ట్ టైం గ్రామ రెవెన్యూ అధికారులకు కూడా గౌరవవేతనం రూ.4 వేల నుంచి 15 వేలకు పెంచాలని, అలాగే రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గ్రామ రెవెన్యూ అధికారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు రవీంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అప్పలనాయుడు, ఎం.బాపూజీ, అర్జునరావు, నళినీ, బాలాజీ రెడ్డి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు చేజర్ల మారుతీ చంద్ర

నూతన కార్యవర్గాల ఎన్నిక

సత్యనారాయణపురం, జూలై 21 : ఆంధ్రప్రదేశ్ వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా చేజర్ల మారుతీచంద్ర(తాడేపల్లి), ఉపాధ్యక్షుడిగా గోలి ధనలక్ష్మి (గుంటూరు), ప్రధానకార్యదర్శిగా బర్రె హనీ ప్రవీణ్, (పాలకొల్లు), అదనపు కార్యదర్శిగా సిరాల చంద్ర (హిందూపురం), కోశాధికారిగా జ్ఞానసాగర్ (విజయవాడ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగులి సుందరశేఖర్ (జంగారెడ్డిగూడెం), ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా రవితేజ, యోనా, ఎస్.నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అగ్రి ఇన్‌పుట్స్ మాన్యుఫ్యాక్చర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్



అగ్రి ఇన్‌పుట్స్ మానుఫ్యాక్చర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక హోటల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడిగా సి.పీటర్‌పాల్, అధ్యక్షుడిగా ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శిగా పొట్లూరి కృష్ణప్రసాద్, సంయుక్తకార్యదర్శిగా ఎ.హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.జగదీష్, కోశాధికారిగా ఎం.మోహనరావు ఎన్నికయ్యారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నంది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్,జూలై 21 : 2024 సంవత్సరానికి వివిధ రంగాలలో ప్రతిభావంతులు, విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి ఈ ఏడాది ఆగస్టు 10న లెజెండరీ, బంగారు నంది పురస్కారాలు అందచేస్తున్నట్టు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్.సరోజనమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి, అల్లూరి సీతరామరాజు స్మారక దినాన్ని పురస్కరించుకుని అవార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు. అన్ని రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులు తమ పూర్తి వివరాలతో ఈనెల 30 తేదీలోగా 6302908528, 9705313061 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు. ఆగస్టు 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

అండర్-11 చెస్ విజేతలుగా కార్తికేయ, గుణశ్రీ

విజయవాడ స్పోర్ట్సు, జూలై 21 : ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడివాడలో ఆదివారం జరిగిన కృష్ణాజిల్లా అండర్-11 బాలబాలికల చెస్‌టోర్నీలో ఎం.కార్తికేయ 5 పాయింట్లతో విజేతగా నిలవగా, బి.వరుణ్‌తేజ్ 4 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచారు. బాలికల విభాగంలో వై.గుణశ్రీ 4 పాయింట్లతో విజేతగా, టి.ప్రణీత 3 పాయింట్లతో రన్నరప్ సాధించారు. తొలి 2స్థానాల్లో నిలిచిన బాలబాలికలను భీమవరంలో ఈనెల 27, 28న జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి కృష్ణా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్ఎం ఫణికుమార్ తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ చైర్మన్ వి.కృష్ణకిషోర్, ప్రెసిడెంట్ వి.సతీష్‌బాబు ట్రెజరర్ టీవీఎస్ ప్రసాద్, సెక్రటరీ వేణుగోపాలస్వామి, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ సుమన్, గన్నవరం చెస్ మేనేజర్ ఆనంద్ పాల్గొని అందజేశారు.


హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మోహన్, జస్టిస్ జ్యోతిర్మయిలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు





కొండంత భక్తితో..

▸ ఆషాఢ పౌర్ణమికి పోటెత్తిన భక్తజనం ▸ కిటకిటలాడిన కీలాద్రి


భక్తజనంతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

వన్‌టౌన్, జూలై 21 : ఆషాఢ పౌర్ణమి.. ఆదివారం శాకంబరీ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం భక్తజనంతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పౌర్ణమి కావడంతో భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. దంపతులు ఖడ్గమాలపూజల్లో పాల్గొన్నారు. చండీహోమం తదితర ఆర్జిత సేవల్లో తరించారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్త బృందాలు కోలాహలంగా అమ్మవారికి సారె సమర్పించారు. భక్తుల రద్దీ నియంత్రించేందుకు ఈవో, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకున్నారు. విశాఖపట్నం కనకమహాలక్ష్మి ఆలయ ఏఈవో రాంబాబు అమ్మవారికి సారె సమర్పించారు. శాకంబరీ



ఉత్సవాలు ముగియడంతో అమ్మవారికి సమర్పించిన పండ్లు, కూరగాయలను భక్తులకు పంపిణీ చేశారు. సకల జనులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆదివారం పండితులు సూర్యోపాసన సేవ, ఆదిత్యునికి అర్చనలు చేశారు. అరుణ పారాయణ, తర్పణ చేశారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మోహన్, జస్టిస్ వి.జ్యోతిర్మయిలు వారి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలు అందచేశారు. దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

వేడుకగా.. దుర్గమ్మ గిరి ప్రదక్షిణ



దుర్గమ్మ గిరి ప్రదక్షిణ ఆదివారం భక్తజనోత్సాహంతో వేడుకగా సాగింది. వానలు పడుతుండటంతో ప్రచార రథంతో గిరిప్రదక్షణ సాగింది. ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్ద రథనికి బలిహరణలు ఇచ్చారు. ప్రచారరథంలో దుర్గమ్మవారికి లఘుపూజ చేసి హారతులు సమర్పించారు. ఈవో రామారావు దంపతులు, ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి, ఆలయ ఏఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు. తప్పెట వాయిద్యాలు, కోలాటాలు, భక్తజన జేజేల మధ్య ప్రచార రథం గిరి ప్రదక్షిణ సాగింది.

తిరుపతమ్మ ఆలయంలో..



పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానంలో శాకంబరి ఉత్సవాన్ని ఆదివారం శోభయామానంగా నిర్వహించారు. తిరుపతయ్య, గోపయ్య స్వాములతోపాటు సహదేవతల విగ్రహాలను ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపి బాబు ఆధ్వర్యంలో అర్చకులు పలురకాల పూలు, పండ్లతో అలంకరణ చేశారు. శాకంబరీ అలంకరణలో అమ్మవారిని తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరమ్మ తల్లి కరుణా కటాక్షాలతో..



ఉయ్యూరు : వీరమ్మ తల్లి కరుణా కటాక్షాలు, దయతో రాష్ట్రం, ప్రజలకు మేలు జరగాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆషాఢమాసం, వ్యాసపూర్ణిమ పురస్కరించుకుని ఉయ్యూరులో వీరమ్మతల్లికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆదివారం ఆషాఢమాస సారె సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వీరమ్మతల్లి చల్లని దయ, సాయిబాబ ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించామన్నారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విరాళం ఇవ్వగానే కార్డు..

విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి విరాళాలు ఇచ్చిన దాతలకు జారీ చేసే డోనర్ కార్డును వెంటనే ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. దీనికి ఆదివారం నుంచి శ్రీకారం చుట్టారు. అమ్మవారికి విరాళాలు ఇచ్చిన దాతలకు ఆలయ అధికారులు డోనర్ కార్డును జారీ చేస్తారు. ఈ కార్డును ఉపయోగించుకుని వారు అమ్మవారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది. విరాళం ఇచ్చిన వారం రోజులకు ఈ కార్డును దాతల చిరునామాకు పంపుతారు. ఈ సంప్రదాయానికి అధికారులు స్వస్తి చెప్పారు. ఇక నుంచి విరాళం ఇవ్వగానే కార్డును వారికి అందజేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఈవో రామారావు డోనర్ సెల్ ఛాంబర్‌లో ఆదివారం ప్రారంభించారు.

లభ్యంకాని ఎంపీడీవో ఆచూకీ

▸ కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఉంగుటూరు/హనుమాన్‌జంక్షన్/పెనమలూరు, జూలై 21 : నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు ఆచూకీకోసం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల పరిధిలో ఏపీఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, క్విక్‌రియాక్షన్‌టీమ్, పోలీస్‌బృందాలు సంయుక్తంగా ఏలూరుకాలువలో చేపట్టిన గాలింపు చర్యలు ఆదివారం కొనసాగాయి. గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య ఆధ్వర్యంలో ఆయా బృందాలు బోట్లు, పడవలు, డ్రోన్లసాయంతో గన్నవరం మండలం కేసరపల్లినుంచి ఉంగుటూరు మండలం తేలప్రోలు వరకు ఏలూరు కాలువతోపాటు బుడమేరును జల్లెడపట్టాయి. ఉంగుటూరు ఎస్సై రవిచంద్రకుమార్ సిబ్బందితో దావాజిగూడెం వంతెననుంచి చినవుటపల్లి వంతెన వరకు ఏలూరుకాలువ రెండువైపులా వున్న గట్ల వెంట గాలించారు. ఆత్కూరు ఎస్సై పైడిబాబు సిబ్బంది, ఇతర సహాయక బృందాలతో కలిసి పెదఅవుటపల్లినుంచి తేలప్రోలు వరకు బోటు సాయంతో ఏలూరుకాలువను రెండువైపులా జల్లెడపట్టారు. బాపులపాడు మండలం ఎ.సీతారాంపురం నుంచి పెరికీడు వంతెన వరకు వీరవల్లి ఎస్సై చిరంజీవి నేతృత్వంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్‌నరసింహమూర్తి బృందం ఏలూరు పడమట లాకులు వరకు గాలించింది. ఎంపీడీవో ఆచూకీ దొరికేంతవరకు గాలింపుచర్యలు కొనసాగుతాయని పోలీసు


వీరవల్లి వద్ద ఏలూరు కాలువలో గాలింపు

ఉన్నతాధికారులు చెప్పారు. గన్నవరం, బాపులపాడు సీఐలు కేవీఎస్ వరప్రసాద్, ఏ.నవీన్‌నరసింహమూర్తి, గన్నవరం, ఉంగుటూరు, ఆత్కూరు, ఎస్సైలు శివప్రసాద్, రవిచంద్రకుమార్, పైడిబాబు, పాల్గొన్నారు. జంక్షన్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది, పెదపాడు ఎస్సై శుభశేఖర్ పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు ఎస్పీ పరామర్శ

కొద్ది రోజులుగా అదృశ్యమైన నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు కుటుంబసభ్యులను కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదివారం పరామర్శించారు. ఆయన భార్య, కుమారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కానూరులో ఎంపీడీవో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని, దిగులు పడవద్దని వారికి ధైర్యం చెప్పారు.

ఇతర రాష్ట్రాల్లోనూ దర్యాప్తు..

మచిలీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పశ్చిగోదావరి జిల్లా నరసాపురం మండలం ఎంపీడీవో మండవ వెంకటరమణ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆదివారం పెనమలూరు సమీపంలోని కానూరులోని ఎంపీడీవో ఇంటికి వెళ్లి ఎంపీడీవో కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉంటే ఎంపీడీవోకు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొంతమంది సైబర్ నేరగాళ్ల ఫోన్‌లు చేసి ఆయన బ్యాంకు ఖాతాలనుంచి నగదు మార్పించుకున్నట్టుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ వివరాలను ఆధారంగా చేసుకు బీహార్, జార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాలకు జిల్లాపోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వెళ్లారు. ఈ కేసుతో సంబంధం ఉన్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకునే పనిలో జిల్లా పోలీస్ బృందాలు ఉన్నట్టు సమాచారం. ఎంపీడీవో అదృశ్యం వెనుక సైబర్ నేరగాళ్ల ప్రమేయం ఉంటుందని, ఆయనను పదేపదే సైబర్ నేరగాళ్లు బెదిరించి నగదును తమఖాతాలకు మళ్లించుకున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో పాత్ర ఉన్న సైబర్‌నేరగాళ్ల పోలీసులకు చిక్కితే ఎంపీడీవో అదృశ్యం కేసు కొంతమేర కొలిక్కివచ్చేందుకు ఆధారాలు లభ్యమయ్యే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. నరసాపురం ఎంపీడీవో తరహాలోనే మరికొందరు అధికారులకు సైబర్ నేరగాళ్ల ఫోన్‌చేసి నగదు గుంజినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టే దిశగా పలు కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

వసతి గృహం నుంచి బాలిక అదృశ్యం

▸ మహిళా, విద్యార్థి సంఘాల ఆందోళన

పాయకాపురం, జూలై 21: పాయకాపురం రాధానగర్‌లోని బాలికల వసతి గృహం నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఇంటి నుంచి వసతి గృహానికి వచ్చిన 24 గంటల్లోనే విద్యార్థిని కనిపించకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నున్న రూరల్ పోలీసులు బాలిక తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన విద్యార్థిని(16)నగరంలోని రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాల ప్రక్కనే ఉన్న వసతి గృహంలో ఉంటున్నది. అనారోగ్య కారణాల వలన వారం క్రితం కొండపల్లిలోని ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తిరిగి హాస్టల్‌కు వచ్చింది. మధ్యాహ్నం వసతి గృహంలో భోజనం చేసి కళాశాలకు వెళ్తున్నట్టు చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం 6 గంటలలోగా వసతి గృహానికి రావాల్సి ఉండగా విద్యార్థిని రాత్రి 8 గంటలైనా రాకపోవడంతో సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బంధువుల ఇంటికి గాని, స్నేహితులతో గాని వెళ్లిందని భావించి మరుసటి రోజు ఆదివారం వరకు ఎదురు చూశారు. బాలిక రాకపోవడంతో విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు వసతి గృహం వద్దకు చేరుకున్నారు. వార్డెన్‌ను పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై ప్రశ్నించారు. తమ కుమార్తె కనిపించకుండా పోవడానికి వసతి గృహం సిబ్బంది, వార్డెన్‌ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నున్న రూరల్ సీఐ దుర్గాప్రసాద్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్య పెళ్లికొడుకు అరెస్టు

▸ మ్యాట్రిమోని ద్వారా మహిళలకు వల



విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో మారు పేర్లతో ప్రొఫైల్ అప్‌లోడ్ చేసుకుని ఒంటరి మహిళలకు వల వేసిన నిత్య పెళ్లికొడుకును గవర్నరుపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కందుకూరుకు చెందిన తుమ్మా మోహన్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం భార్య పిల్లలను వదిలేశాడు. వ్యవసనాలకు అలవాటు పడ్డాడు. షేర్‌మార్కెట్‌లో షేర్లు కొనడం, అమ్మడం చేసేవాడు. ఇందులో డబ్బులు భారీగా కోల్పోయాడు. తర్వాత డబ్బులు సంపాదించడం కోసం నిత్య పెళ్లికొడుకు అవతారం ఎత్తాడు. తెలుగు మ్యాట్రిమోని, షాదీ.కామ్ వంటి వెబ్‌సైట్లలో వివిధ రకాల పేర్లతో ప్రొఫైల్ అప్‌లోడ్ చేశాడు. ఇందులో విడాకులు తీసుకున్న, భర్త చనిపోయిన మహిళలను టార్గెట్ చేసుకున్నాడు. వారితో పరిచయం పెంచుకుని ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసేవాడు. విజయవాడకు చెందిన ఓ మహిళతో ఈవిధంగా పరిచయం పెంచుకున్నాడు. తన పేరు కార్తీక్ అని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగనని నమ్మించాడు. సొంతంగా విల్లాలు ఉన్నాయని ప్రగల్బాలు పలికాడు. ఏడాదికి రూ.45లక్షల వేతనం వస్తుందని వివరించాడు. ఇద్దరం పెళ్లి చేసుకుందామని, తాను విజయవాడకు వస్తున్నానని హోటల్‌లో కలుద్దామని చెప్పాడు. ఆభరణాలు ఏమైనా ఉంటే తెచ్చుకుని అలంకరించుకుని ఇద్దరం కలిసి తీయించుకున్న ఫొటోను తల్లిదండ్రులకు చూపించి ఒప్పిస్తానని నమ్మించాడు. ఏప్రిల్ నెలలో గవర్నరుపేట పీఎస్ పరిధిలోని ఒక హోటల్‌కు రప్పించుకున్నాడు. ఆమె స్నానం చేయడానికి వెళ్లిన సమయంలో 16 తులాల బంగారు ఆభరణాలు, ఫోన్, స్కూటర్ కాజేశాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ గౌతమి శాలి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌత్ జోన్ ఏసీపీ జి.రత్నరాజు ఆధ్వర్యంలో సీఐ రమణ, ఎస్సై నారాయణమ్మ సిబ్బంది రెండు బృందాలుగా నిందితుల కోసం గాలించి, గవర్నరుపేట దున్నావారి వీధిలో అరెస్టు చేశారు. నిందితుడు గత ఏడాది నవంబరులో గుంటూరులో ఇదే తరహా కేసులో ఒక మహిళ నుంచి ఏడు లక్షలు తీసుకుని పారిపోయాడు. అదే నెలలో తెలంగాణాలో ఒక మహిళ నుంచి 25 తులాల బంగారం తీసుకుని పారిపోయాడు. గత ఏడాది జనవరి నెలలో ఒక మహిళ వద్ద నుంచి క్రెడిట్ కార్డు ద్వారా రూ. 6లక్షలు వాడుకుని మోసం చేశాడు. 2021 డిసెంబర్ నెలలో ఒక మహిళను మోసగించి ఆమె కారును తీసుకుని ఉడాయించాడు. నిందితుడిపై గుంటూరు దిశ పీఎస్, తెలంగాణలోని కందుకూరు, మార్కెట్ పీఎస్, మియాపూర్, పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి.


నిందితుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్సు పోలీసులు

21.5 కిలోల గంజాయి స్వాధీనం

విద్యాధరపురం, జూలై 21 : పాడేరు నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి విక్రయిస్తున్న భవానీపురం పోలీసుకాలనీకి చెందిన పెయ్యావుల తరుణ్‌కుమార్ అలియాస్ పండు (25)ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 21.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే భవానీపురం పోలీసుస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా, దొంగతనాలు, పోక్సో కేసులు నమోదయ్యాయి. నిందితుడు అతడి స్నేహితులు మరో ముగ్గురితో కలిసి పాడేరు నుంచి గంజాయిని తెచ్చి అమ్ముతున్నాడు. పోలీసులు నిఘా పెట్టి అరెస్టు చేశారు.

రాజుపేటలో చోరీ

▸ 15 కాసుల బంగారం అపహరణ

మచిలీపట్నం టౌన్, జూలై 21 : మచిలీపట్నం రాజుపేటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో దొంగలు పడి 15 కాసుల బంగారం, రూ. 10వేల నగదు అపహరించారు. ఇనకుదురు సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ కందుల లక్ష్మీ అమలాపురం జిల్లా ముమ్మిడివరంలో పని చేస్తున్నారు. ప్రతి ఆదివారం రాజుపేటలోని తన ఇంటికి వచ్చి సోమవారం ముమ్మిడివరం వెళుతూ ఉంటారు. రాజుపేటలో ఒంటరిగా ఉంటున్న తల్లిని కలుస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో గత శనివారం వచ్చి తల్లిని కూడా ముమ్మిడివరం తీసుకుని వెళ్లారు. తిరిగి ఈనెల 20న తల్లితో కలిసి ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి బీరువా పగులకొట్టి ఉండటం గమనించారు. 15 కాసుల బంగారం, రూ.10వేల నగదు అపహరించినట్టు పోలీసులకు లక్ష్మి ఫిర్యాదు చేశారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఇనకుదురు విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

▸ పలువురికి స్వల్ప గాయాలు



పెనుగంచిప్రోలు, జూలై 21 : 65వ నెంబర్ జాతీయ రహదారిపై మండలంలోని తోటచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రంలోని సూర్యపేటకు చెందిన పాలకుర్తి వెంకటేశ్, మందస్సు వేణు, తన్నీరు రాజు, వామన శ్రీధర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం ప్రకారం.. సూర్యపేటకు చెందిన వెంకటేశ్, వేణు రాజు, శ్రీధర్ తదితరులు అరుణాచలం వెళ్లి కారులో స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా, ఆదివారం సాయంత్రం తోటచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఐరన్ డబ్బాలను కారు ఢీకొంది పక్కనే ఉన్న డివైడర్‌కు తగలటంతో కారు ముందు భాగం కొంత మేర దెబ్బతింది. వారికి స్వల్ప గాయాలుకాగా 108 అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30	

అమరావతి అభివృద్ధికి నేనుసైతం..

పెనమలూరు, జూలై 21 : ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధికి నేనుసైతం.. అంటూ లక్ష రూపాయల విరాళం అందించారు గంగూరు గ్రామ సర్పంచి భర్త అక్బర్ పాషా, అక్బర్‌పాషా తండ్రి అబ్దుల్ కుద్దు సాహెబ్ జ్ఞాపకార్థం తాను ఈ విరాళం అందిస్తున్నట్లు ఆయన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కోయ ఆనంద్‌ప్రసాద్, అబ్దుల్‌సలాం, కంచర్ల శేఖర్, చుండూరు శివ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న అక్బర్‌బాషా



గంగానమ్మకు బోనం సమర్పించేందుకు వెళ్తున్న వెలగపూడి శంకరబాబు, శ్రీదేవి దంపతులు



ఉయ్యూరు వైష్ణవాలయంలో..



వీరవల్లి కనకదుర్గ ఆలయంలో..



బాబా ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

వైభవంగా ఆషాఢ పౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

పెనమలూరు, జూలై 21 : ఆషాఢ పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎక్కడికక్కడ భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకర బాబు, శ్రీదేవి దంపతులు కామయ్యతోపు గంగానమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మేళతాళాలు, బేతాళనృత్యాల నడుమ ఉత్సాహంగా బోనాల ఊరేగింపు సాగింది. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నప్రసాద వితరణ గావించారు. ● పోరంకి శ్రీనివాసనగర్ కాలనీలో నిషిరిడీ సాయినాథునికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, హేమ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిరిడీ సాయినాథుని అనుగ్రహ కటాక్షాలు ప్రజలకు తోడుగా ఉండాలని వారు ఆకాంక్షించారు. విశేష పూజల అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి ఆషాఢ సారె

ఉయ్యూరు : శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శ్రీలలితా మహిళా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా లలితా సహస్ర నామ పారాయణం చేసి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి రొంపిచర్ల మురళి ప్రత్యేక పూజలు చేశారు. బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు చోడవరపు బాపిరాజు తదితరులు పాల్గొని సేవలందించారు.

● గురుపౌర్ణమి పురస్కరించుకుని బాబా మందిరాల వద్ద ఆదివారం పూజలు, అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకాలు, పూల అలంకారాలు చేశారు. రాజర్షినగర్, రామాలయం సెంటర్, కేసీపీ కర్మాగారం సమీపాన, గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి పూజలు, భజనల్లో పాల్గొన్నారు.

● సాయిబాబా మందిరాల వద్ద ఆదివారం అన్న సమారాధన చేశారు. రాజర్షినగర్ జ్ఞాన సాయిబాబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనను మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మందిర ట్రస్టీ పూర్ణచంద్ర రావు ప్రారంభించారు. కేసీపీ కర్మాగారం సమీపాన, శివాయం సమీపాన, గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు.

మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు : సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆయన సతీమణి హేమతో కలిసి ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని మొక్కలు తీర్చుకున్నారు. తొలుత పెనమలూరు మండలంలోని గోసాల శివారు వైకుంఠపురంలోని కనకదుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాస సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు సెంగెపు రంగారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. గొడవర్రు అంకమ్మ తల్లి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మాదు నాగరాజు తదిత రులు పాల్గొన్నారు. చలివేంద్రపాలెం, ఉప్పలూరు, ప్రొద్దుటూ రు, కంకిపాడులోని సాయి నాథుని ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రి విహార్‌లోని బాబా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సహస్రమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా చలివేంద్రపాలెంలోని సాయిబాబు ఆలయంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న బోడె ప్రసాద్

శాకంబరీగా తిరుపతమ్మ

గన్నవరం : పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆల యంలో ఆదివారం శాకంబరి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపారు. లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. శాకంబరిదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తొలుత ఆలయ ప్రాంగణం నుంచి మాను (మహాలక్ష్మీ)కి పూజలు చేసి గ్రామ పొంగళ్లను నివేదించారు. అంకమ్మ తల్లికి ఆషాఢ బోనాలను సమర్పించారు. సువాసినీలచే శ్రీలలిత సహస్రనామ పారాయణం, శ్రీలక్ష్మీ అష్టోత్తరం జరిపారు. జాస్తి శ్రీధర్ పాల్గొన్నారు.



గురుపౌర్ణమి పూజల్లో భక్తులు

●కేసరపల్లి దుర్గాపురంలో కనకదుర్గమ్మ ఆలయంలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో మేళతాళాలు, కోలాటాలతో అమ్మవారికి పూజలు చేశారు. లలితా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. బ్రాహ్మణ పరిషత్ మండల అధ్యక్షులు పన్యారం విష్ణుమూర్తి, కప్పగంతు లక్ష్మణశాస్త్రి, గోపరాజు సత్యపవన్‌కుమార్, మామిళ్లపల్లి నాగసుబ్బారావు, తిమ్మరాజు వెంకట సుబ్బారావు, యామర్తి వకుళ, సరస్వతుల ఆదిత్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీగా కనకదుర్గమ్మ

హనుమాన్‌జంక్షన్ : ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వీరవల్లి కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని కూరగాయలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళీ ఆధ్వర్యంలో ఆలయ నిరాహ్వకుడు వంగపండు సూర్యప్రకాశరావు దంపతులు అమ్మవారికి సారెను సమర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి శ్రీనివాసరావు దంపతులు, కొండపల్లి వెంకన్న పాల్గొన్నారు. కె.సీతారాంపురంలో గంగానమ్మకు గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు ఎనికేపల్లి శ్రీమన్నారాయణ, మజ్జి శ్రీనివాసరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

● జంక్షన్‌లోని బాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకొని బాబాకు విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు బాబాను దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మందిరానికి స్థానిక వ్యాపార వేత్త ముప్పా శ్రీనివాసరావు, సత్యవతి దంపతుల కుమార్తె ఎన్నారై భావన రూ.2లక్షలు విలువ చేసే 2కిలోల వెండి పూజా సామగ్రిని అందజేశారు.

● వీరవల్లి బాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు వేడుకగా నిర్వహించారు. తొమ్మిది రకాల పండ్ల రసాలతో అభిషేకం, అమ్మవారికి శాకంబరి అలంకరణ చేసి, కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. తేలప్రోలు భజన సమాజం బృందం సభ్యులు నిర్వహించిన షిరిడీసాయి గానామృతం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచింది. 1800 మందికి అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబీ, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, గుత్తా నాగమణి, లంక బేబీ సరోజిని, తుమ్మల భావన తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



జంక్షన్‌లో బాబా మందిరానికి వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

బాపులపాడులో జ్వర పీడితులకు రక్తపరీక్షలు

హనుమాన్‌జంక్షన్, జూలై 21 : బాపులపాడులో విషజ్వరాలు ప్రబలకుండా సర్పంచ్ సరిపల్లి కమలాబాయి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామలోని పలు ఏరియాల్లో జ్వర పీడితులకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ముందస్తు రక్త పరీక్షలు నిర్వహించారు. తారకరామనగర్, ఎస్సీ కాలనీ ఏరియాల్లో జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. మరో పక్క పారిశుధ్య పనులను కార్యదర్శి సీహెచ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు. ఈవోపీ ఆర్డీ విజయలక్ష్మి, మలేరియా సబ్‌డివిజన్ అధికారి వెంకటరాజు సూపర్‌వైజర్ అప్పారావు, వైద్యసిబ్బంది నాగరాజు, కోటేశ్వరి, మల్లిక, నాగలక్ష్మి, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అధికారుల కోసం వేచిచూడకుండా..



గోతులు పూడుస్తున్న టీడీపీ నాయకులు

పెనమలూరు, జూలై 21 : తమ ప్రాంతంలో రోడ్లపై ఉన్న గోతులను తామే స్వయంగా పూడ్చి శ్రమదానం చేయటంలో మహదానందం ఉందని నిరూపించారు యనమలకుదురు టీడీపీ నాయకులు. యనమలకుదురు కొండ వెనుక మసీదు వద్ద, జెండా చెట్టు వద్ద ఎప్పటి నుంచో రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందుల ఎదురవుతుండడంతో చూడలేక, అధికారుల కోసం వేచిచూడక టీడీపీ నాయకుడు మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తామే రోడ్లపై గుంతలు పూడ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరికీ ఆదర్శంగా నిలిచారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



నగదు బహుమతి అందజేస్తున్న అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు గంగాధరరావు దంపతులు

గండిగుంట (ఉయ్యూరు), జూలై 21 : లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని గండి గుంట అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు కంచర్ల గంగాధరరావు(బాబ్జి) అన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని ఇంజనీరింగ్ చదువుతున్న గాయత్రీ దుర్గకు మెరిట్ ప్రోత్సాహక బహుమతిగా గంగాధరరావు, గంగా భవాని దంపతులు రూ. 10వేలు అయ్య ప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అంద జేశారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకుని పేరు ప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మండవ జయదేవ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

గన్నవరం, జూలై 21 : స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సోమవారం 11 గంటల నుంచి 12వరకూ నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, సలహాలను ఇవ్వాలని కోరారు. 87909-96090 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మహిళపై దాడి

హనుమాన్‌జంక్షన్, జూలై 21: చెడు సావాసాలతో తన మేనల్లుడిని చెడగొడుతున్నాడన్న అక్కసుతో స్థానిక ఇందిరా నగర్ కాలనీకి చెందిన వడ్డి సుధీర్ అదే కాలనీకి చెందిన అక్కపోలు లక్ష్మీపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డి సుధీర్ మేనల్లుడు అబీ, ఫిర్యాది మనవడు శరణ్ స్నేహితులు. శరణ్ సావాసంతో అబి చెడిపోతున్నాడనే అక్కసుతో బాధితురాలితో సుధీర్ శనివారం రాత్రి ఘర్షణ పడ్డాడు. ఈ నేపథ్యంలో లక్ష్మిని తలపై కొట్టి గాయ పరిచాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలు ఆసుపత్రిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

వీరసైనికులకు అండగా జనసేన

పార్టీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్

పెనమలూరు, జూలై 21 : జనసేన పార్టీ కోసం పనిచేసే ప్రతి వీర సైనికుడికీ, వీరమహిళకూ భరోసా ఇవ్వాలనే దృక్పథంతో, వారి కుటుంబాలకు అవసరమైన పరిస్థితుల్లో ఒక నమ్మకాన్ని, ధైర్యాన్ని కల్పించడం కోసమే జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ పేర్కొన్నారు. ఆదివారం కానూరు పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రియాశీలక సభ్యత్వం తీసుకొనే ప్రతి జనసైనికుడి కుటుంబానికి ఆపత్కాల పరిస్థితులు సంభవించినప్పుడు ఈ బీమా ద్వారా వచ్చే సొమ్ము కొంత వరకు ఉపశమనం ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 28 వరకు జరిగే సభ్యత్వ నమోదులో ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు చేర్పించే వారికి ప్రత్యేక బహు మతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గోళ్ల శ్రీనివాస్, కాకాని లోకేష్, తిరుపతమ్మ, సుభాషిణి, నవీన్, రిజ్వాన్, రఫీ, సుబ్బారావు, గంధం సురేష్, ఏ శ్రీనివాస్, సూర్యప్రకాష్, కొప్పనాతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాతపూడి గణేశ్..

ప్రమాద బీమా చెక్కు అందజేత

కంకిపాడు : పార్టీ నాయకులు, కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వ యకర్త ముప్పా రాజా అన్నారు. ఆరు నెలల క్రితం గంగూ రులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెం దిన కోడెబోయిన రమేష్ కుటుంబ సభ్యులు నాగలక్ష్మి, మణికంఠలకు రూ. 5 లక్షల చెక్కును ఆదివారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సుంకర శివ, పచ్చిపాల శేఖర్, ఓంకార్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాగబాబు

ప్రభుత్వ స్థలం ఆక్రమించి బోరు!

పట్టించుకోని ఆర్ అండ్ బీ.. నగర పంచాయతీ..

ఉయ్యూరు, జూలై 21 : ఉయ్యూరు ప్రధాన సెంటర్, రింగ్ సర్కిల్ సమీపాన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఓ భవన యజమాని బోరు పంపు నిర్మాణం చేపట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెద్ద గోతులు తవ్వి, మెయిన్ డ్రెయిన్ అనుకుని ప్రభుత్వ స్థలంలో బోరు పంపు పనులు మూడురోజులుగా యథేచ్ఛగా చేస్తున్నా ఆర్‌అండ్‌బీ, నగర పంచాయతీ అధికారులు ఆపేందుకు చర్యలు చేపట్టకుండా మేము కాదంటే మేము కాదని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. షాపింగ్‌లకు అద్దెకిచ్చే భవన ం ముందు ప్రభుత్వ స్థలంలో బోరు పంపు వేస్తున్నారని ఆర్‌అండ్‌బీ, నగర పంచాయతీ అధికారులకు తెలియ పరచినా పట్టించుకున్న వారు లేరన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇరు శాఖల అధికారులు మొక్కుబడిగా చూసి వెళ్లి చర్యలు తీసుకోపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



యథేచ్ఛగా సాగుతున్న పనులు

అండర్-11 చెస్ విజేతలకు బహుమతులు

గుడివాడ : త్రివేణి పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ, ఎస్.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్-11 బాల, బాలికల చెస్ పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో ఎం.కార్తీకేయ, బి.వరుణ్‌తేజ్, బాలికల విభాగంలో వై.గుణశ్రీ, టి.ప్రణీత విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులను అందజేశారు. లయన్స్ క్లబ్ చైర్మన్ వి.కృష్ణకిషోర్, అధ్యక్షుడు వి.సతీష్‌బాబు, కార్యదర్శి వి.వేణుగోపాలస్వామి, కోశాధికారి టి.ప్రసాద్, పోటీల చీఫ్ ఆర్బిటర్ సుమన్, గన్నవరం చెస్ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



కంకిపాడు, జూలై 21 : కంకిపాడు ఫ్లై ఓవర్ వద్ద అధ్వానంగా ఉన్న కంకిపాడు - పునాదిపాడు ప్రధాన రహదారికి మరమ్మతు పనులు ఆదివారం చేపట్టారు. 'వర్షం నీటిని తొలగించాలి' అని ఆదివారం ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. దీంతో టీడీపీ సీనియర్ నాయకులు మద్దాలి రామచంద్రరావు, సాయిబాబు ఫ్లై ఓవర్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు పరిస్థితిని ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవికి ఫోన్ చేసి వివరించారు. తాత్కాలిక మరమ్మతులు చేయించి, నీటిని తొలగించాలని చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఉపసర్పంచ్ ఈఓ రామకృష్ణ, శానిటరి ఇన్‌స్పెక్టర్ రామారావులకు పరిస్థితి చక్కదిద్దాలని సూచించారు. దీంతో తక్షణ చర్యగా రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు.

పుల్లయ్య చెరువులో పడి ఒకరి మృతి

పాయకాపురం, జూలై 21 : నున్న శివారుల్లోని పుల్లయ్య చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆరేపల్లి కిషోర్‌బాబు (35) కూలీగా పనిచేస్తుంటాడు. ఈ నెల 19న ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కిషోర్ బాబు మృతదేహం పుల్లయ్య చెరువులో కనిపించింది. సమా చారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.30



మైత్రీ ఫౌండేషన్ రక్తదాన శిబిరం

మచిలీపట్నం టౌన్ : రక్తదాతల ఔదార్యం వల్ల ప్రాణాలకు రక్షణ ఏర్పడుతుందని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భానుకిరణ్ అన్నారు. మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెల్ ఉద్యోగుల సమావేశ మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ భానుకిరణ్ ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛంద సేవాసంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. మైత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు ఏఆర్‌కెప్రసాద్, శ్రవణం శివ, బాబు, పావని తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో సాయిబాబాకు విశేష పూజలు





గుడ్లవల్లేరులో 365 కలశాలతో భక్తుల గ్రామోత్సవం, సాయిబాబాకు అభిషేకం



పురిటిగడ్డలో సాయిబాబాకు అభిషేకం



కోడూరులో సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

మచిలీపట్నం టౌన్, జూలై 21 : గురుపూర్ణమిని ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ప్రముఖ షిరిడి సాయిబాబా దేవాలయాలు ఆదివారం కిటకిటలాడాయి. జిల్లా కోర్టుసెంటర్, భాస్కరపురం, శిడింబి అగ్రహారంలోని ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజలు జరిపారు. అన్నదాన కార్యక్రమాలు జరిపారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పి.వి. ఫణికుమార్, ఎస్. శివశంకర్, గంజాల రవికుమార్, సత్యం, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **పెడన** : భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో చేశారు. పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షుడు రామ్మోహనరావు, పెడన శాఖ అధ్యక్షుడు సమయమంతుల ముత్యాలరావు, సభ్యులు అంకం మురళి, భవానీ, అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బళ్ళ ప్రసాద్, ప్రధాన అర్చకుడు గూడూరు అగస్త్యయ్య పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరులోని గంగాపార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి దేవస్థానంలోని సాయిబాబా ఆలయంలో గుడివాడకు చెందిన నాగరాజు క్యాటరింగ్స్ అధినేత కె.నాగరాజు, లక్ష్మీకుమారి దంపతులు మహా రుద్ర సంఖ్యాక షష్ట్యుత్తర శత అభిషేకం కార్తీక్ శర్మ నేతృత్వంలో నిర్వహించారు. కలశాల ఊరేగింపును గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకటరావు ప్రారంభించారు. సాయిబాబాకు అభిషేకం, దత్తహోమం, అనఘాలక్ష్మీ హోమం, రుద్ర హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. సాయిబాబా పుష్పయాగోత్సవం కనువిందు చేసింది. దేవస్థానం ఛైర్మన్ కొసరాజు వెంకటాద్రి (పెదబాబు), అన్నే ప్రసాదరావు, ఎ.వీరభద్రరావు, పాతూరి వెంకటేశ్వరరావు (బుజ్జి), వై.రామ్మోహన్, వల్లూరుపల్లి రామకృష్ణ, పొట్లూరి రవి కుమార్, సింగంశెట్టి ఆదినారాయణ, మూల్పూరి సుధా పాల్గొన్నారు. అనంతరం 3000 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కౌతవరం షిరిడీ సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహా అన్న సమారాధన నిర్వహించారు. గుత్తికొండ శ్రీనివాస్(అమెరికా) అన్న సమారాధనకు రూ.లక్ష విరాళంగా అందచేశారని షిరిడీ సాయి సేవాట్రస్టు ఛైర్మన్ కానూరి బాలకృష్ణ మోహన్ (బాలు) తెలిపారు. బాబాను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, దర్శించుకున్నారు. **గుడివాడ** : పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.



దొండపాడు షిర్డి సాయి మందిరంలో

పెద ఎరుకపాడు శ్రీషిర్డి సాయి మందిరంలో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. **గుడివాడ రూరల్** : దొండపాడు షిర్డి సాయి మందిరంలో ముక్తినేని అమర్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. చిన ఎరుకపాడు, చౌటపల్లి, బొమ్ములూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. **పామర్రు** : పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో గురుపౌర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. పామర్రు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. **పెదపారుపూడి** : వెంట్రప్రగడ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **చల్లపల్లి** : పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి ధ్యానమందిరంలో బాబా వారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. అశ్వారావుపాలెం మురహరి అవధూత భక్తబృందం సాయి ఏక నామం భజన చేశారు. మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ధర్మకర్త నాదెళ్ల శివరామకృష్ణ పర్యవేక్షించారు. **అవనిగడ్డ** : షిర్డీ దివ్య సాయి మందిరంలో ధర్మకర్త మండలి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉద్దండి సాంబశివరామ ప్రసాద్ పుష్పాలంకరణ చేయించారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డ షిర్డి సాయినాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, నాలుగు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావు, దుర్గారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **కోడూరు** : షిర్డి సా యి దివ్య ధ్యాన జ్ఞాన మందిరంలో క్షీరాభిషేకం నిర్వహించారు. మూడు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ రేపల్లె వెంకట నారాయణ (రఘు) ఏర్పాట్లను పర్యవేక్షించారు. **మోపిదేవి** : కప్తానుపాలెం షిర్డి సాయి మందిరంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కొర్రపాటి కళ్యాణ్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో బాబా వారికి విశేష పూజలు నిర్వహించారు. ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **నాగాయలంక** : నాగాయలంకలోని షిర్డి సాయిబాబామందిరంలో ధర్మకర్త వర్రే సుమన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అర్చకులు పెద్దాడ శ్రీనివాస శాస్త్రి నిర్వహించారు. భారీ అన్నసంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు మద్ది వెంకటేశ్వరరావు, భీమా బాబురావు, రాసంశెట్టి పాపారావు, బండ్రెడ్డి బోస్ తదిరతులు పర్యవేక్షించారు. **కూచిపూడి** : పెదపూడి, నిడుమోలు, కోసూరు, నరసంపాలెం, మొవ్వ, పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంతోపాటు పలు ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

ఘంటసాల : ఘంటసాలలోని బుద్ధవిహార్‌లో బౌద్ధ భిక్షు వు బంతేజీ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఘంటసాల హైస్కూల్ బాలబాలికలకు ధ్యానం నేర్పించి నగదు బహుమతులు అందజేశారు. బాలికలలో ప్రథమ బహుమతి పొందిన మాధవీలతకి రూ.1000, ద్వితీయ బహుమతి పొందిన రేచల్ల జ్యోతికి రూ.500, బాలురులో ప్రథమస్థానంలో నిలిచిన భార్గవకి రూ.1000, ద్వితీయ స్థానం పొందిన ఆదిత్యకు రూ.500 నగదు అందించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో హార్మోనిస్టు కొడాలి రాజాను సత్కరిస్తున్న శిష్యులు



వేదపండితులు, విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



ఘంటసాల బుద్ధవిహార్‌లో బంతేజీ ఆధ్వర్యంలో వేడుకలు

గురువులకు సత్కారం

మచిలీపట్నం టౌన్ : గురుభక్తి కలిగి ఉన్న వారికి విజయాలు సులభంగా చేకూరుతాయని మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. గురుపౌర్ణిమ సందర్భంగా కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం వేదపండితులు త్రినాథ్ శర్మ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అంబటి అశోక్ కుమార్, యోగ గురువులు మద్దాల చింతయ్య, శీలం రమేష్‌లను ఘనంగా సత్కరించారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ యోగా గురువులు పేర్నేటి గంగాధర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అంబటి అశోక్ కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ ఆధ్వర్యంలో యోగ గురువులు మానేపల్లి శ్రీనివాస్ , విశ్వంశెట్టి మధు, వడ్డి శ్రీనివాస్, రమేష్, చింతయ్యలను సత్కరించారు. చింతగుంటపాలెంలో విశ్రాంత చరిత్రశాఖ అధ్యాపకులు వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. **గుడివాడ** : హార్మోనిస్టు కొడాలి రాజాను శిష్యులు నాగమల్లిఖార్జునరావు, నాగుల్, దుర్గారావు సత్కరించడం అభినందనీయమని కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు నెరుసు చింతయ్య, డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ బలరాం, స్వామి దాసుఅన్నారు. కళాకారుల సంఘ కార్యాలయంలో సత్కారం నిర్వహించారు. మట్టా రాజా, యార్లగడ్డ సత్యనారాయణ, శీలం శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక కాపు కళ్యాణమండపంలో మను సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నిత్య యోగా శిక్షణ తరగతులను కె.డి.ఎన్.వి శ్రీనివాస్ ప్రారంభించారు. యోగ గురువులను ఘనంగా సత్కరించారు. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహూకరించారు. డాక్టర్ కొడాలి సోమసుందరరావు, కె.డి.ఎన్.వి శ్రీనివాస్, కొలుసు రవి, జి.రంగారావు, లీలావతి, స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యులు, మహిళ వాకర్స్ సభ్యులు, కాపు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. **కోడూరు** : గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద మాజీ జడ్పీటీసీ సభ్యులు బండే శ్రీనివాసరావు విశ్రాంత ఉపాధ్యాయులు, గురువులను ఘనంగా సత్కరించారు. శేషగిరిరావు, పూతబోయిన శ్రీనివాసరావు, బచ్చు వెంకటేష్, బండే శేషగిరిరావు, మేడా శివాజీ, గోగినేని సోమశేఖరరావు, బడే సాయి, బడే కృష్ణ, దావు మల్లి పాల్గొన్నారు.



శాకంబరిగా కొండాలమ్మ



శాకంబరిగా విశ్వనాథపల్లి నాంచారమ్మ



శాకంబరిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు

వైభవంగా శాకంబరీ ఉత్సవాలు

గుడ్లవల్లేరు, జూలై 21 : వేమవరం కొండాలమ్మ ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో మూలవిరాట్‌ను, అలివేటి మండపంలోని అమ్మవారిని, దేవస్థానం ఆవరణను అలంకరించారు. 30 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో కానూరి సురేష్ కుమార్ తెలిపారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ మునిసిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాస్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. శేషవస్త్రంతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. **కోడూరు** : విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ శాకంబరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శిం చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈవో సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. **చల్లపల్లి** : ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని శాకంబరిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు. యువజన సంఘం అధ్యక్షుడు తమ్మన సత్యవెంకట సాంబశివరావు, ఆర్యవైశ్యసంఘ అధ్యక్ష కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, వరదా రాజశేఖర్, దింటకుర్తి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. గ్రామదేవత సంపటాలమ్మ తల్లి అమ్మవారికి, శివాలయంలోని అన్నపూర్ణాదేవికి ఆషాఢ సారె సమర్పించారు.



గణపేశ్వరం దుర్గాదేవికి ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు



ఆది వనమలమ్మకు సమర్పించిన ఆషాఢ సారె

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

నాగాయలంక : గణపేశ్వరం దుర్గాదేవికి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, లేబాక పద్మప్రియ ఆధ్వర్యంలో 108 కేజీల పసుపు, కుంకుమతో ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తులు విరివిగా మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి విశేష పూజలు చేశారు. అర్చకులు పోతుకూచి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త మండల రాం బాబు, సిబ్బంది పర్యవేక్షించారు. **మచిలీపట్నం టౌన్** : చమ్మనగిరిపేటలోని మహిషాసురమర్థనీ అమ్మవారికి 121 కలశాల పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చన, లక్షమల్లెలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చేబ్రోలు బాబీ, చేబ్రోలు సాయిరామ్, ఆలయ పాలకవర్గ కార్యదర్శి యెండూరి సురేష్, నంబూరి శ్రీనివాస్, చేబ్రోలు సులోచన, కొల్లిపర బాలాజీ, ఎం. నాగప్రసాద్, తమ్మన నారాయణ దంపతులు పాల్గొన్నారు.

ఆదివనమలమ్మకు సామూహిక కుంకుమార్చన

మచిలీపట్నం టౌన్ : ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా నిజాంపేటలో నూతి వీరయ్య వారి ఆది వనమలమ్మ దేవాలయంలో ఆదివారం అమ్మ వారికి ఆషాఢ సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. ఆలయ నిర్వాహకులు నూతి వనవెంకట సత్యనారాయణ (రమణ) పర్యవేక్షించారు.



పేద విద్యార్థినికి సహాయ ఫౌండేషన్ ఆర్థిక సాయం

పెడన : పేద విద్యార్థినికి సహాయ ఫౌండేషన్ సాయం అందజేసింది. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు కుర్మా ఆంజనేయులు, శ్యామలాకుమారి దంపతుల కుమార్తె సాత్విక పదవ తరగతిలో 572 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుప్పా వరప్రసాద్, గాయత్రి దంపతులు సాత్విక చదువుకు ఆదివారం రూ. 8 వేలు అందజేశారు. ఉస్మాన్ బాషా, కాగిత శంకర సాంబశివరావు, కోన వెంకటేశ్వరమ్మ, ఖుర్షిద్‌బేగం, రౌతుల ప్రసాద్, బైలపాటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లకు మరమ్మతులు ప్రారంభం

గుడివాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అతి తక్కువ ధరతో పేద వాడి కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రెండు అన్న క్యాంటీన్‌ల మరమ్మత్తుల పనులను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీలతో ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కుమార్‌రాజా పర్యటన

పామర్రు : రైతుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే సహించేది లేదని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ఎలకుర్రు, కొరిమెర్ల, నిమ్మలూరు గ్రామాల్లో ముంపుబారిన పొలాలను ఆదివారం ఎమ్మెల్యే కుమార్ రాజా సందర్శించారు. ముంపు సమస్య పరిష్కారానికి తక్షణం చర్య లు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ మురళీకృష్ణను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గంట వ్యవధిలోనే ఎక్స్‌వేటర్‌ను తీసుకువచ్చి పూడిక తీత పనులు ప్రారంభిచడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల్లో వరద నీరు చేరడంతో ఉయ్యూరు ఆర్డీవో డి.రాజుతో ఫోన్‌లో మా ట్లాడారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఆర్య వైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారం

గుడివాడ : ఆర్య వైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం గంగా గ్రాండియర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా బెజవాడ బాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోపూరి రవికిరణ్, కోశాధికారిగా విస్సంశెట్టి పవన్ ఆదిత్య, ఉపాధ్యక్షులుగా పైడి గోపాలకృష్ణమూర్తి, జవ్వాజి పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు చిన్ని రామ సత్యనారాయణ, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గోకవరపు సునీల్, చక్కా చెన్నకేశవరావు పాల్గొన్నారు.

అండర్-11 చెస్ విజేతలకు బహుమతులు

గుడివాడ : త్రివేణి పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ, ఎస్.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్-11 బాల, బాలికల చెస్ పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో ఎం.కార్తికేయ, బి.వరుణ్‌తేజ్, బాలికల విభాగంలో వై.గుణశ్రీ, టి.ప్రణీత విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులను అందజేశారు. లయన్స్ క్లబ్ ఛైర్మన్ వి.కృష్ణకిషోర్, అధ్యక్షుడు వి.సతీష్‌బాబు, కార్యదర్శి వి.వేణుగోపాలస్వామి, కోశాధికారి టి.ప్రసాద్, పోటీల చీఫ్ ఆర్బిటర్ సుమన్, గన్నవరం చెస్ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షా కేంద్రానికి శంకుస్థాపన

పెడన : ఇకపై పెడనలోనే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షల ఎన్‌హెచ్‌ఎం నిధులతో నిర్మించనున్న (క్షయ వ్యాధి పరీక్షా కేంద్రం) భవనానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్‌లో క్షయవ్యాధి పరీక్షలు చేసి వెంటనే రిపోర్టులు ప్రకటిస్తారన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఫర్వేద్ హైదర్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ అబ్దుల్ ఖయూం (హన్ను), టీపీవో ఏసుబాబు, మునిసిపల్ ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ జయరామ్, శీరం ప్రసాద్ పాల్గొన్నారు.



పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీపతి మృతి.. కాగిత నివాళి

పెడన రూరల్ : కొంకేపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శలపాటి లక్ష్మీపతి శనివారం రాత్రి మృతి చెందారు. మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్‌కు లక్ష్మీపతి సోదరుడు. లక్ష్మీపతికి భార్య, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కొంకేపూడి వెళ్లి లక్ష్మీపతి భౌతికకాయానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ నేత బుల్లయ్య, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఉప్పాల రాము, జడ్పీటీసీ సభ్యుడు నగేష్, శీరం ప్రసాద్, భైరవలింగం, రామ్మోహనరావు, జోగి వెంకటేశ్వరరావు తదితరులు లక్ష్మీపతికి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సుల్లో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023



బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీని నుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్ఎస్ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్యశ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువస్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కిందిస్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తిచేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్ఎస్ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని చేవ్రాలు, వేలి ముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

బీఎన్ఎస్ఎస్‌పై విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్ఎస్ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణింపబడి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్ఎస్ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్ఎస్ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటీష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్ఎస్ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్ఎస్ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.

కళతప్పిన కృష్ణపట్నం

- అదానీ స్వార్థం, కాకాణి దందాలకు బలి
- కంటైనర్ కార్గో నిలిపివేతతో తీరని నష్టం
- రోడ్డునపడ్డ వేలాదిమంది ఉద్యోగులు
- ఎగుమతుల్లేక సాగు ఉత్పత్తుల ధర పతనం
- గ్రానెట్ పరిశ్రమపైనా పెనుభారం

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

కృష్ణపట్నం పోర్టు.. రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపార కేంద్రం. ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కేంద్రం. మూడేళ్ల క్రితం వరకు దేశంలోనే పెద్ద కంటైనర్ కార్గో కేంద్రంగా గుర్తింపు పొందింది. జగన్ ప్రభుత్వంలో పోర్టు యాజమాన్య బాధ్యతలు నవయుగ నుంచి అదానీకి మారడంతో పరిస్థితి మారిపోయింది. అదానీ స్వార్థం, నాటి మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అక్రమ వసూళ్ల కారణంగా పోర్టు క్రమేణా నిర్వీర్యం అయింది. వ్యాపారం తగ్గిందనే సాకు చూపి అదానీ కంటైనర్ కార్గో నిలిపివేసి, సొంత వ్యాపార ప్రయోజనాల కోసం పోర్టును డర్టీ కార్గోగా మార్చివేసింది. తమిళనాడులో అదానీకే చెందిన ఎన్నూరు పోర్టులో బొగ్గు, ఐరన్ కార్గో పట్ల అక్కడ తీవ్ర వ్యతిరేకత రావడంతో కృష్ణపట్నం పోర్టుకు మార్చింది. కంటైనర్ కార్గో నిలిపివేతతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పతనం చేసింది. రాయలసీమ గ్రానైట్ పరిశ్రమలను దెబ్బతీసింది. వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులను వీధిన పడేసింది. పోర్టు ఆధారంగా ఏర్పడిన పరిశ్రమలను శాశ్వతంగా మూసేలా చేసింది. వైసీపీ అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2019 వరకు ఉజ్వలంగా వెలిగిన కృష్ణపట్నం పోర్టు గత మూడేళ్ల కాలంలో నిర్వీర్యమైంది. పోర్టును నమ్ముకున్న రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు.



నవయుగ నుంచి అదానీకి

కృష్ణపట్నం పోర్టు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ రైతుల త్యాగఫలంతో ఏర్పాటైంది. 1996లో పోర్టు స్థాపించారు. 2007 నుంచి కంటైనర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. 2020 మార్చి వరకు ఈ పోర్టు నవయుగ సంస్థ ఆధీనంలో నడిచింది. 2007 నుంచి 2020 వరకు పోర్టులో కంటైనర్ ఆపరేషన్లు అద్భుతంగా నడిచాయి. మొత్తం 14 బెర్తుల్లో 4 బెర్తులు కంటైనర్ కార్గోకు కేటాయించారు. వీటి ద్వారా రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానెట్ తదితరాలు ఎగుమతయ్యేవి. పరిశ్రమలకు సంబంధించిన మిషనరీ తదితరాలు విదేశాల నుంచి దిగుమతయ్యేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోర్టుకు గ్రహణం పట్టింది. నవయుగ సంస్థకు ఇబ్బందులు మొదలయ్యాయి. 2020లో పోర్టును అదానీ చేతుల్లో పెట్టకతప్పని పరిస్థితులను నవయుగ సంస్థకు కల్పించారు. ఈ కుట్రలో అప్పటి సీఎం జగన్ హస్తం ఉందనే ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. 2019కి ముందు రాజకీయాలకు అతీతంగా పోర్టులో వ్యాపార కార్యకలాపాలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పోర్టుపై ఆ పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. కరోనా ప్రభావం తగ్గిన వెంటనే అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృష్ణపట్నం పోర్టు వ్యవహారాల్లోకి కాలుపెట్టారు. ఒకవైపు కాకాణి వర్గం అక్రమ వసూళ్ల దందా సాగిస్తుండగా, అదే సమయంలో అదానీ ముందస్తు వ్యూహంతో బెర్త్ ఇన్‌చార్జిలు, హ్యాండిలింగ్ చార్జీలు భారీగా పెంచేశారు. భరించలేక పలువురు పెద్ద లైనర్లు కృష్ణపట్నం పోర్టుకు రావడం మానేశారు. కృష్ణపట్నం కంటైనర్ బిజినెస్‌లో మస్క్ వాటానే 50 శాతం. ఆయన రెండేళ్ల క్రితమే కృష్ణపట్నం పోర్టు వదిలి పెట్టేశారు. దీంతో కంటైనర్ బిజినెస్ ఒక్కసారిగా సగానికి పడిపోయింది. అదానీకి చెందిన ఎన్నూరు (తమిళనాడు) పోర్టులో ఆ కంపెనీ ఉత్పత్తులైన బొగ్గు, ఐరన్ ఓర్ కార్గో పట్ల స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో బొగ్గు, ఐరన్ ఓర్ తదితర డర్టీ కార్గోను కృష్ణపట్నం మార్చారు. ఇక్కడ వ్యాపారం తగ్గిందనే సాకు చూపి ఎన్నూరు పోర్టును కంటైనర్ కార్గోగా మార్చుకొని, కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గోగా మార్చేశారు. 2024 జనవరి 31 నుంచి పోర్టులో కంటైనర్ కార్గో పూర్తిగా ఆపేశారు. దీంతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానెట్ ధరల పతనం మొదలైంది. ప్రధానంగా నెల్లూరు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి సగటున నెలకు 1000 కంటైనర్ల బియ్యం విదేశాలకు ఎగుమతి అయ్యేది. ఒక్కో కంటైనర్‌లో 25 టన్నుల బియ్యం బస్తాలు చొప్పున నెలకు 25 వేల టన్నుల బియ్యం ఎగుమతి అయ్యేది. పూర్తిగా ఆగిపోవడంతో ఇప్పుడు చెన్నై, ఎన్నూరు పోర్టులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు రవాణా చార్జీలు, హ్యాండిలింగ్ చార్జీలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం వరి ధాన్యం ధరలపై పడుతోంది. కంటైనర్ కార్గో ఆగిపోవడంతో పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2-3 వేల కోట్లు నష్టపోతుందన్నది అంచనా.

కాకాణి అవినీతితో ముసలం

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ కార్గో మూతపడటానికి ప్రధాన కారణం కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతే అనే వాదన బలంగా వినిపిస్తోంది. 2021కి ముందు పోర్టులో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు ప్రధాన పార్టీల నాయకులు పంచుకునేవారు. అధికార పార్టీ నాయకులు 60 శాతం, ప్రతిపక్షనేతలు 40 శాతం పనులు చేసుకునేవారు. కంటైనర్ కార్గో కాంట్రాక్టులను మాత్రం సర్టిఫైడ్ కంపెనీలకే కేటాయించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కంటైనర్ కార్గో కార్యకలాపాల ద్వారా కూడా డబ్బు సంపాదించుకోవాలనే ఆశతో స్థానిక వైసీపీ నాయకులు లారీ అసోసియేషన్ అనే దానిని ఏర్పాటు చేసుకున్నారు. పోర్టులోకి కంటైనర్లను రవాణా చేసే యజమానులను భయపెట్టి అసోసియేషన్‌లో చేర్చుకున్నారు. పోర్టు బయట ఒక టోల్‌గేట్ పెట్టి లారీలను ఆపేయించారు. ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపి లారీ టైర్లలో గాలి తీయించారు. పోలీసులు, ఆర్టీఏ అధికారుల ద్వారా తప్పుడు కేసులు పెట్టించారు. ఈ టోల్‌గేట్‌కి కాకాణి టోల్‌గేట్ అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. దీంతో విధిలేక ట్రాన్స్‌పోర్టర్లు అందరూ ఈ అసోసియేషన్‌లో చేరారు. తర్వాత దందాలు మొదలయ్యాయి. ప్రతి వాహనం కాకాణి టోల్‌గేట్ వద్ద రూ.2వేలు చెల్లించాలి. అంతేగాక కంపెనీ లేదా డీలర్ ట్రాన్స్‌పోర్టర్‌కు చెల్లించే అద్దెలో 20 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇలా లారీ అసోసియేషన్ పేరుతో ప్రతి లోడుపై రూ.5-7 వేలు దండుకున్నారు. కమీషన్ల బెడదతో ట్రాన్స్‌పోర్టర్లు, డీలర్లు ఈ పోర్టుకు రాకుండా చెన్నై పోర్టుకు వెళ్లడం ప్రారంభించారు. అయినా వైసీపీ గ్యాంగ్ అరాచకాలు ఆపలేదు. అనధికారిక టోల్‌గేట్ ఏర్పాటు చేసి వెంకటాచలం హైవే మీదుగా వెళ్లే వారి నుంచి వసూళ్లు చేసింది. దీన్ని కాకాణి టోల్‌గేట్ నంబర్-2గా పిలిచేవారు.

ఎన్నో అనర్థాలు...

కంటైనర్ కార్గో ద్వారా గతంలో 10 వేలమంది ఉద్యోగులు పోర్టులో పనిచేసేవారు. పోర్టులో 600 కంపెనీల కార్యకలాపాలు ఉండేవి. ఇప్పుడు కార్గో మూతపడటంతో వీరందరూ ఉపాధి కోల్పోయారు. ఆరు వేల ఎకరాల్లో విస్తరించిన పోర్టులో ప్రస్తుతం నికరంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులు 300 నుంచి 400 మంది మాత్రమే. బొగ్గు దిగుమతుల కారణంగా కాలుష్యం విస్తరిస్తోంది. ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లో విషకారకాల వల్ల ప్రజలకు చర్మవాధులు వస్తున్నాయి. బొగ్గురేణువుల కాలుష్యం నెల్లూరు నగరం హరినాథపురం వరకు వస్తోంది. భవిష్యతులో పోర్టు కాలుష్యం నెల్లూరు నగరంతో పాటు గూడూరు, సూళ్లూరుపేట, కావలి, కందుకూరు డివిజన్ల ప్రాంతాలను సైతం కమ్మేస్తుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.



'ఇంటి' దొంగలపై చర్యలేవీ..?

- మంత్రి ఆదేశించినా కదలని హౌసింగ్ ఉన్నతాధికారులు
- విచారణలో తమ పాపాలు కూడా బయటపడతాయనే భయం!
- గత ప్రభుత్వంలో అడుగడుగునా భారీ అవినీతి, అక్రమాలు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలు బుట్టదాఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో గత జగన్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన పథకం అడుగడుగునా అవినీతిమయమైన సంగతి జగమెరిగిన సత్యం. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ దగ్గరి నుంచి.. మెరక పనుల వరకూ వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారు. మరోవైపు పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లు కూడా రూ.వేల కోట్లు కొట్టేసి పత్తా లేకుండా పోయారు. 'మేం మాత్రం తక్కువ తిన్నామా...!' అన్నట్టు హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బరితెగించి ఈ దోపిడీలో భాగస్వాములయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాల గురించి పత్రికలు, టీవీ చానెళ్లు, సోషల్ మీడియాలో వరుస కథనాలు వెలువడినా జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రజాధనాన్ని లూటీ చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు మొదలుకొని జిల్లాల్లోని అధికారులు, ఉద్యోగులు, సాధారణ సిబ్బంది వరకూ అందరూ అవినీతికి పాల్పడి పేదలకు తీరని అన్యాయం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో అడ్డూఆపు లేకుండా సాగిన ఈ అవినీతి, అక్రమాలపై నిజాలు నిగ్గు తేలుస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు ఇచ్చిన నివేదికలను గత వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. అయితే ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పోయి.. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అన్ని ప్రభుత్వ శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన దోపిడీని బయటపెడుతోంది. దీంతో గృహనిర్మాణ శాఖలో జరిగిన భారీ అవినీతి, కుంభకోణాలపై కూడా లోతుగా విచారణ చేసి.. 'ఇంటి' దొంగల భరతం పట్టాలనే డిమాండ్లు అధికమయ్యాయి.

మంత్రి ఆదేశించినా కదలని యంత్రాంగం

గత ప్రభుత్వం ఆప్షన్-3 కింద పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. దాంతో దాదాపు 3.5 లక్షల మంది ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారుల తరఫున ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా అడ్వాన్సులు తీసుకున్నారు. ఆ ఇళ్లకు సంబంధించిన సిమెంట్, ఇసుక, స్టీలు, ఇతర మెటీరియల్‌ను కూడా వాడేసుకున్నారు. కానీ చాలామంది కాంట్రాక్టర్లు లాభదాయకంగా ఉన్న బేస్‌మెంట్ లెవెల్ వరకు మాత్రమే పూర్తిచేసి.. తర్వాత నుంచి పనులు చేయకుండా బిచాణా ఎత్తేశారు. ఈ అంశాలన్నీ ఇటీవల అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించినప్పుడు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి వచ్చాయి. దాంతో మంత్రి సీరియస్‌గా స్పందించారు. కాంట్రాక్టర్లు తీసుకెళ్లిన మెటీరియల్‌ను ఉపయోగించారా...? దుర్వినియోగమయ్యాయా..? అనేది పరిశీలన చేసి కచ్చితమైన సమాచారంతో ఈ నెలాఖరుకల్లా నివేదిక ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేయకుండా పోయిన కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి.. దోపిడీ చేసిందంతా రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హౌసింగ్ ఉన్నతాధికారులు మాత్రం దీన్ని అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. మంత్రి సమీక్ష ముగిసి 15 రోజులు గడిచినా అధికారులు వేగంగా కదలడం లేదు. ఈ అవినీతి భాగోతంలో భాగస్వాములైన అధికారులే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడమే దీనికి కారణమని హౌసింగ్ వర్గాలే చెబుతున్నాయి. విచారణ చేపడితే తమ పాపాలు కూడా బయటపడతాయనే భయంతోనే తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్డింగ్ మెటీరియల్ కొనుగోళ్లలో ఇష్టారాజ్యం

తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి పేద అక్కచెల్లెమ్మలకు ఆస్తిగా అందజేస్తాని అధికారంలో ఉండగా జగన్ ఊదరగొట్టారు. కానీ, కేంద్రం వాటా కింద ఇచ్చిన 22 లక్షల ఇళ్లనే మంజూరు చేశారు. వాటిలో కూడా.. ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. వీటిలో ఎక్కువ ఇళ్లు లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో నిర్మించుకున్నవే. ఇక మిగిలిన 17 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. అయితే సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని జగన్ గొప్పలు చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా ఆప్షన్-3ని ఎంచుకున్నారు. ఆ ఇళ్ల నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించి.. ఒక్కో ఇంటికి రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు చెల్లించారు. అలాగే ఆ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలును హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ముందే సరఫరా చేసేశారు. అడ్వాన్సు డబ్బులు, సిమెంటు, స్టీలు ముందుగానే తీసేసుకున్న కాంట్రాక్టర్లు చాలా మంది పునాదులు కూడా పూర్తి చేయకుండానే ముఖం చాటేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి.. దాదాపు 22 లక్షల ఇళ్ల కోసమంటూ 13 రకాల నిర్మాణ సామాగ్రిని రాష్ట్రస్థాయిలోనే కొనుగోలు చేసి.. లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాలవారీగా హౌసింగ్ గొడౌన్లకు బలవంతంగా తరలించారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.1,12,117 విలువైన సామగ్రిని ముందుగానే కొనుగోలు చేసేశారు. అంటే 22 లక్షల ఇళ్ల కోసమని ఏకంగా దాదాపు రూ.25 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రిని ముందుగానే కొనుగోలు చేయడం వెనుక భారీ కుంభకోణమే దాగి ఉంది. ఈ సామగ్రిని కొనుగోలు చేయడానికి టెండర్లు పిలవడానికి ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని రూ.వందల కోట్లు మింగేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

గోడౌన్లలో తుప్పు పట్టిపోతున్న సామగ్రి

నాసిరకం నిర్మాణ సామగ్రిని ఎక్కువ ధరలకు అంటగడుతుండటంతో లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు కూడా వాటిని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పు పట్టి పాడైపోతోంది. దాదాపు మూడొంతులకు పైగా సామగ్రి జిల్లాల్లోని గోడౌన్లలోనే అలాగే ఉండిపోయింది. వెంటనే ఆ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేసేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారితే మొదటికే మోసం వస్తుందన్న భయంతో మే నెలాఖరుకల్లా గోడౌన్లలో ఉన్న మొత్తం స్టాక్‌ను లబ్ధిదారులకు సరఫరా చేసేయాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో జిల్లాల్లోని ఏఈలు, డీఈలు, ఈఈలు, జిల్లా హెడ్స్ అందరూ ఒక్కసారిగా అలెర్ట్ అయిపోయి.. పది రోజుల్లోనే ఏకంగా 5,11,629 పరికరాలను లబ్ధిదారులకు ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు నమోదు చేసేశారు. దాదాపు 90 శాతం వరకు లబ్ధిదారులకు ఇచ్చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేశారు. ఈ మెటీరియల్స్ విలువ రూ.154 కోట్ల పైమాటే. ఈ మెటీరియల్ సరఫరాలో నిజాలు నిగ్గు తేలాలంటే లబ్ధిదారులను కలిసి విచారణ చేస్తే మొత్తం అవినీతి బాగోతం బయటపడుతుంది.